క్లుప్తంగా

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ

• రూ.2.57 లక్షల ఆదాయం


శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,57,388 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు, మజ్జిగ చలివేంద్రాన్నీ ఏర్పాటు చేసినట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు పాల్గొన్నారు.

ఓటు వేసి స్వీప్ లక్ష్యం సాధించాలి


స్వీప్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన మానవహారం

పెద్దాపురం: స్వీప్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతిఒక్కరూ ఓటు వేయాలని పెద్దాపురం మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) కన్వీనర్లుఎంపీడీఓ జి.ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శనివారం స్వీప్‌పై విస్తృత ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా స్వీప్ పని చేస్తుందని చెప్పారు. స్వీప్ లక్ష్యాన్ని నెరవేర్చేలా అధికార యంత్రాంగం పని చేస్తుందన్నారు. అనంతరం ఫ్లెక్సీలతో ర్యాలీ, మానవహారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై వెలుగుల సురేష్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నక్కా సత్యనారాయణమూర్తి, మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకతిప్పలో ఏకాహం


వాకతిప్పలో రామాలయం వద్ద ఏకాహం నిర్వహిస్తున్న భజన బృందాలు, భక్తులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప పద్మశాలి రామాలయం వద్ద శనివారం ఏకాహం నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భజన బృందాల సభ్యులు భజనలు చేసి సంకీర్తనలు ఆలపించారు. తొలుత పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు


చేబ్రోలులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

గొల్లప్రోలు: వేసవి నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ జయప్రకాష్ శనివారం తెలిపారు. మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందున ప్రజల దాహార్తి తీర్చేందుకు గాను జనసందోహం ఎక్కువగా ఉండే చోట, ముఖ్య కూడళ్లు, పీహెచ్‌సీల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

పెద్దాపురం: వడ్లమూరులో ఇటీవల క్యాన్సర్‌తో మరణించిన కొట్టు కృష్ణార్జున కుటుంబానికి శనివారం గ్రామానికి చెందిన 2000 పదో తరగతి బ్యాచ్ ఆర్థికసాయం అందించింది. పూర్వ విద్యార్థులు సుమారు రూ.45 వేలు సమకూర్చి బాధిత కుటుంబానికి అందించారు.

వివాహిత అదృశ్యం

కరప: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్సై టి.రామకృష్ణ శనివారం తెలిపారు. వాకాడ గ్రామానికి చెందిన దూడల రత్నరాజుకు, ధవళేశ్వరం మండలం వేమగిరి గ్రామానికి చెందిన పెన్నాడ దివ్య వెంకటదుర్గ వరలక్ష్మి అభితతో ఆరు నెలల క్రితం వివాహమైంది. ఈ నెల 14వ తేదీన రత్నరాజు తన తల్లితో కలిసి ఓ ఫంక్షన్‌కు వెళ్లాడు. ఇంటికి తిరిగొచ్చి చూసేసరకి అభిత కనిపించలేదు. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లోను, బంధుమిత్రుల వద్ద గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం రాత్రి అభిత భర్త, అత్త కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చిరు వర్తకులకు తోడుగా..

• రోడ్డు మార్జిన్ వ్యాపారులకు జగనన్న తోడు
• పావలా వడ్డీ రుణాలతో వ్యాపారాభివృద్ధి
• మున్సిపాలిటీలో 2,175 మందికి లబ్ధి


సామర్లకోటలో జగనన్న తోడు సాయంతో పండ్ల వ్యాపారం చేస్తున్న జీలకర్ర బాబూరావు


సామర్లకోట వీర్రాఘవపురంలో మూడో విడత రుణం రూ.50 వేలతో ఫ్యాన్సీ వ్యాపారం చేస్తున్న చక్రరావు

సామర్లకోట: రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే వారికి జగనన్న తోడు.. వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటుగా మారింది. అప్పట్లో కె. రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రోడ్డు మార్జిన్‌లో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి పావలా వడ్డీతో రుణాలిస్తామని ప్రకటనలు చేశారు. పాలకులు మారినా ఇది మాత్రం అమలు కాలేదు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో తోపుడు బండ్ల వ్యాపారులకు రుణాలిని ప్రకటనలు చేసి, కేవలం గుర్తింపు కార్డులిచ్చి చేతులు దులుపుకొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రతి ఒక్కరినీ ఆదుకోవాలనే లక్ష్యంతో రోడ్డు మార్జిన్‌లో వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంకుల నుంచి రూ.10 వేల చొప్పున రుణాలివ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులను గుర్తించడానికి మెప్మా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దాంతో తోప్పుడు బండ్ల వ్యాపారులను గుర్తించి, బ్యాంకు నుంచి రూ.10 వేల రుణం ఇప్పించారు. రుణాలు తీసుకున్న కొద్ది రోజులకే కోవిడ్ రావడంతో వ్యాపారులు ఇబ్బందులకు గురికావడం, రుణాలను సకాలంలో చెల్లించకపోవడంతో అనేక మంది డిఫాల్టర్లుగా మారారు. జగనన్న తోడు పథకంలో రూ.10 వేల రుణం పావలా వడ్డీకి ఇస్తారు. ఆ మొత్తాన్ని ప్రతి నెలా వాయిదాగా రూ.వెయ్యి, వడ్డీ కలిపి చెల్లించాల్సి ఉంది. వాయిదాలను సకాలంలో చెల్లించిన వారికి అదనపు రుణాలను బ్యాంకు అధికారులు మంజూరు చేస్తున్నారు. సక్రమంగా చెల్లించిన వ్యాపారులందరూ ఏటేటా మరింత రుణాన్ని పొంది, తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నారు.

గతంలో మైక్రో ఫైనాన్స్ బాధలు



జగనన్న తోడు రుణాలు రాక ముందు వ్యాపారులు మైక్రో ఫైనాన్స్ వారి నుంచి రుణాలు తీసుకునేవారు. రూ.10 వేలకు ముందుగానే రూ.1,500 మినహాయించి, రూ.8,500 చేతికి ఇచ్చేవారు. రోజుకు రూ.100 చొప్పున రూ.100 రోజులు చెల్లించాల్సి వచ్చేది. దాంతో వడ్డీ భారం ఎక్కువగా ఉండేది. జగనన్న తోడు రుణం రూ.10 వేలను సక్రమంగా చెల్లించడంతో, ఆ తర్వాత వ్యాపారులు రూ.20 వేలను రుణాలుగా పొందారు. ఇటీవల ఆ రూ.20 వేలు కూడా సక్రమంగా చెల్లిచడంతో, మరో దఫా రుణం అందాల్సి ఉంది. సకాలంలో రుణాలు చెల్లిస్తే పావలా వడ్డీ అమలవుతుంది. దాంతో చిరు వ్యాపారులపై భారం తగ్గి వారి వ్యాపారాలు అభివృద్ధి చెందుతున్నాయి.

– గొల్లపల్లి వెంకటరమణ, పూల వ్యాపారి, స్టేషన్ సెంటర్, సామర్లకోట

మున్సిపాలిటీలో 2,175 మంది లబ్ధిదారులు



పట్టణంలోని రోడ్డు మార్జిన్‌లోను, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారిని మెప్మా ఆర్పీలు సర్వే చేసి 2,175 మందిని గుర్తించారు. వీరిలో అనేక మంది సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో వారికి పావలా వడ్డీ వర్తించలేదు. 438 మంది వాయిదాలను సకాలంలో చెల్లించి రెండో విడత రుణంగా రూ.20 వేలు పొందారు. 27 మంది మూడో విడతలో బ్యాంకుల నుంచి రూ.50 వేల చొప్పున పావలా వడ్డీపై రుణాలు పొందారు. లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు జారీ చేశాం. గుర్తింపు కార్డుల ఆధారంగా బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. చిరు వ్యాపారులు చేసుకునే పొదుపు ఆధారంగా రుణాల మొత్తం పెరుగుతుంది.

– సుజాత, మెప్మా సీటీ మిషన్ మేనేజరు, సామర్లకోట

స్ఫూర్తిదాయక విజయాలను అందుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న రాంబాబు

పెద్దాపురం: ప్రతి విద్యార్థి తమలో దాగి ఉన్న సృజనాత్మకతకు పదును పెట్టి స్ఫూర్తిదాయక విజయాలను అందుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం కోనసీమ జిల్లా ప్రేరణ జిల్లా స్థాయి పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఆర్.కమలం అధ్యక్షతన జరిగిన ప్రేరణ సదస్సులో సమగ్ర శిక్ష ఏఎంఓ రాంబాబు మాట్లాడుతూ స్ఫూర్తిదాయక పోటీతత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో 158 పాఠశాలల్లో పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ప్రిన్సిపాల్ కమలం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు గుజరాత్ రాష్ట్రంలోని ఇవాద్ నగర్‌కు పంపిస్తారన్నారు. తొలుత పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, జగన్‌మోహన్‌రావు, సత్యనారాయణ, నగేష్; సుధీర్‌కుమార్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

టానిక్‌లా జగన్ బస్సు యాత్ర


ముఖ్యమంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన తోట సుబ్బారావునాయుడు

• తోట, మలకల చేరికతో పార్టీ కేడర్‌లో ఉత్సాహం


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన మలకల చంటిబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం బస్సు యాత్రతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో ఉత్సాహం రెట్టింపయింది. పెద్దాపురం– సామర్లకోట ఏడీబీ రోడ్డులో స్థానిక సత్యనారాయణపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడలిలో ఊహించని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ శ్రేణులు, ప్రజల నుంచి భారీగా స్వాగతం లభించింది. సామర్లకోట నుంచి అచ్చంపేట జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకూ అభిమానులు, కార్యకర్తలు బారులు తీరడం, ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కే ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి ఓ మహిళతో మాట్లాడడంతో.. ఈ బస్సు యాత్ర పార్టీ కేడర్‌కు బలమైన టానిక్‌లా పని చేసింది. దాంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ వార్డుల్లో ఉత్సాహంగా ప్రచారంలో నిమగ్నమయ్యారు. పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, కాకినాడ ఎంపీ అభ్యర్థులకు ఇది ప్లస్ పాయింట్ అయింది. దీనికితోడు మాజీ ఎమ్మెల్యే తోట గోపాలకృష్ణ తనయుడు తోట సుబ్బారావు నాయుడు వైఎస్సార్ సీపీలోకి తిరిగి రావడం, ఆయన అభిమానుల్లోనూ ఉత్సాహం నింపింది. అదేవిధంగా జనసేన నేత, పీబీ దేవం గ్రామానికి చెందిన మలకల చంటిబాబు కూడా వైఎస్సార్ సీపీలోకి చేరడంతో పార్టీ శ్రేణులు ఆనందంలో ఉన్నారు. దీనికితోడు జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ చైర్మన్ గొరకపూడి చిన్నయ్యదొర పార్టీలోకి చేరడం వైఎస్సార్ సీపీకి మరింత బలం చేకూరింది. ఇప్పటికే పార్టీ అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ, కుమార్తె సార్విక ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటూ, మహిళా ఓటర్లను ఆకర్షిస్తున్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా


హుస్సేన్‌పురంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లు రాజీనామా చేశారు. మూలపేటలో ముగ్గురు, ఉప్పాడలో ఇద్దరు, అమీనాబాద్‌లో తొమ్మిది మంది, కొమరగిరి ఆరుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు నేరుగా సేవలు అందిస్తున్న తమపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

హుస్సేన్‌పురంలో...

సామర్లకోట: పేద ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు చేయడానికి వలంటీర్ పోస్టులకు రాజీనామా చేస్తున్నామని మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన వలంటీర్లు తెలిపారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆచార్యులుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వలంటీర్లుగా చేరామన్నారు. అయితే ప్రతిపక్షాల కుట్రలతో తమ విధులకు దూరం కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రాజీనామాలు చేసి తమ గ్రామంలోని ప్రజలకు సేవలు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు.

మీ ఇంటి బిడ్డగా ఆదరించండి


సామర్లకోటలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు

• 40 ఏళ్ల తర్వాత స్థానికునికి దక్కిన అవకాశం
• 24, 25 వార్డుల్లో దవులూరి దొరబాబు ఎన్నికల ప్రచారం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం స్థానికుడైన తనకు వచ్చిందని, తమ ఇంటి బిడ్డగా ఆదరించి, ఓసారి అవకాశమివ్వాలని పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక 24, 25 వార్డుల్లో మన్యం చంద్రరావు, గుబ్బల సత్యనారాయణ, మేకా శ్రీనివాసు, సేపెని సురేష్, యార్లగడ్డ జగదీష్ ఆధ్వర్యంలో దొరబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు మేలు చేస్తున్నాయన్నారు. 40 ఏళ్ల తర్వాత సామర్లకోటకు చెందిన తనకు ఎమ్మెల్యే టికెట్ లభించిందని ఇంటింటా తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో స్థానిక అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశం దక్కిందన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను అమలు చేశారన్నారు. ఆర్థిక సమానత్వం సాధించడమే లక్ష్యంగా ఆయన పని చేస్తున్నారని చెప్పారు. ఆయా సంక్షేమ పథకాలను వేలెత్తి చూపే ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టడానికి చంద్రబాబు కల్లబొల్లి హామీలిస్తున్నారని, ఓటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేసేందుకు చంద్రబాబు హామీలిస్తున్నారని, ఆయనను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సంక్షేమ పాలనకు కీలకమైన వలంటీరు వ్యవస్థపై చంద్రబాబు అండ్ కో తప్పుడు ఆరోపణలు చేసి, అవ్వాతాతలను ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు దమ్మాల లక్ష్మణరావు, కుంచం మాధవరావు, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్, సీనియర్ నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, మసకపల్లి సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసరావు, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'నిజాయితీపరుడైన నా భర్తను గెలిపించండి'


పెద్దాపురంలో తన భర్త దొరబాబుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చంద్రకళ


పెద్దాపురం: మీలో ఒక్కడూ, నిత్యం మీతో ఉండే అందరివాడు, నిజాయితీపరుడైన నా భర్తను ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలంటూ.. వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 23వ వార్డులో ఆమె అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీరాజేశ్వరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, వార్డు కౌన్సిలర్ ముప్పన శ్యామలాంబ, సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాలను గుర్తుంచుకోవాలన్నారు. ఆయా పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న, స్థానికుడైన దొరబాబుకు, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, టౌన్ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి


పిఠాపురం మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలో పన్ను బకాయిలు ఉన్నవారు ఏప్రిల్ నెలాఖరు లోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ సూచించారు. పిఠాపురం మున్సిపాలిటీని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పన్నులు 90 శాతం వసూలయ్యాయని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూలు గడువు గత మార్చి నెలలో పూర్తయినప్పటికీ ప్రభుత్వం మరో నెల అవకాశం కల్పించిందన్నారు. ఏప్రిల్ నెలాఖరు లోపు ఐదు శాతం రాయితీతో చెల్లించే వెసులుబాటు కల్పించినందున బకాయిదారులు పన్నులు చెల్లించి రాయితీని వినియోగించుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మూడో రోజూ నామినేషన్లు నిల్


నామినేషన్ల సందడి లేపోవడంతో ఖాళీగా ఉన్న పిఠాపురంలో ఆర్‌డీఓ కార్యాలయం

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై మూడు రోజులైనా ఇప్పటివరకూ బోణీ కాలేదు. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకూ ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధికారులు ఖాళీగా ఉంటున్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి ముహూర్తాలు చూసుకోవడం వల్లే ఇప్పటివరకూ నామినేషన్లు పడలేదని అధికారులు భావిస్తున్నారు. ఆదివారం నుంచి నామినేషన్లు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ నెల 22 నుంచి నామినేషన్లు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.